రికి చేరింది. సాపోలె కొట్టుకుంటున్న ఖాశీంను జూసి నిలువెల్లా చెమటలు కుమ్మరించినయి నసీంబీకి. మనసుల ఉప్పెనోలె దన్నుకొస్తున్న ఏడుపును ఉగ్గ పట్టుకొని ఇమ్మత్ తెచ్చుకుంది. మొలను ఊడవీకింది. బొయ్య బొయ్య నెత్తురు సిమ్మింది. నడుంకున్న తువ్వాల గట్టిగ గుంజి కట్టింది. నల్లాలం ఆకు దూసుకొచ్చి దెబ్బ మీద పసరు పిండింది. ఇమ్మతి తెచ్చుకోమని భుజం మీద శెయ్యి వేయించుకొని.. మెల్లగ గుట్ట కిందికి దింపింది. గుడిసెల నులక మంచం మీద పడుకోబెట్టింది. చెంబెడు నీళ్లు దాగించింది.

''బాబా! బాబా! బహుత్ మార్ లగా క్యా? దరత్ దేరా బాబా! హంకో నైయి దిక్తానా!'' అంటూ చంటి పిల్లలోలే విలపించింద్రు బిడ్డలు గోర్‌బీ, మదర్‌బీ. ఆళ్ల గుండె చెరువైంది.

''డాక్టర్‌కో బులాకే లావుంగా!'' అంటూ జెల్ది జెల్ది ఊరుదారి వట్టింది నసీంబీ.

''నకోజీ! ఇద్రావ్!'' అంటూ పండుకొనే పిలిశిండు ఖాశీం.

మాట వినకుండా వెళ్లింది ససీంబీ. డాక్టర్ రాజేశం ఊరికెళ్లిండని వాడకట్టోళ్లు చెప్పింద్రు.

''గాచారం పాడుగాను! శనేషుడు మా ఎంబడి వడ్డడు'' అని నెత్తికొట్టుకొని అదే అరుగుపైన బీరిపోయి కూకుంది. కండల్ల నీళ్లు నిండి ఒక్కొక్క చుక్క మెరుస్తూ మత్తడి దుంకుతున్నయి. ఈ సంగతి తెలిసిన ఆ వాడోళ్లు..

''అయ్యో! అందరి నోట్లో పండసొంటోడు ఖాశీం. పీర్ల పండుగప్పుడు అల్వా సుట్టు ఆసోయ్ దూల, ఆటపాట గమ్మతిగ పాడుకుంట దుంకుతంటే దుమ్మురేగేది!'' అన్నది పటేల్ బాలవ్వ.

''పాపం దాన గుణం ఉన్న దండి మనిషి! అనుమాండ్ల గుడికి కట్రాళ్లు ఇచ్చిండు. పైసలు తీసుకొమ్మని పూజారి అంటే.. 'అయ్యా! నాది ఉడత భక్తి అనుకోండ్రి!' అన్నడు''.. కంటతడి పెట్టుకుంట చెప్పింది అయ్యవార్ల అనంతమ్మ.

''రంజాన్ పండుక్కు కుండెడంత 'కీర్' అండుకచ్చి.. మసీద్ కాడ మోత్కాకు దొప్పల్ల బోసుకుంట పొల్లగాండ్లకు ఇస్తుంటే.. 'కీర్ వోత్తుండు కీర్ తాత!' అనుకుంట సుట్టూ ఈగలోలె ముసురు కొందురు. తురక కాశి తాత!.. ఎట్ల పిలిశినా ముసి ముసి నవ్వుతుండె!'' అన్నది కమ్మరి ఈరవ్వ.

మగని మంచితనం అందరి నోళ్లల్లో నానుతుంటే.. ఆపుకొన్న దుఃఖం కట్టలు దెంచుకున్నది నసీంబీకి. బోరున ఏడ్చింది.

అమ్మలక్కలందరూ ఓదార్చింద్రు.

''ఇల్లంతకుంట, సిరిసిల్ల దవాఖాన్ల కన్నా దోలుకపోతే జెల్ది మగ్గుతది'' అని సలహా ఇచ్చింద్రు.

గుండె చెరువు గాంగ కండ్లు తుడుసుకుంట ఇంటికి చేరింది.

''క్యాజీ! ఊళ్లె డాక్టర్ లేడు. ఇల్లంతకుంటనన్న సిరిసిల్లనన్న పోదాం పా!'' అన్నది దిక్కు తోచక నసీంబీ.

''గిసొంటి ఎన్నో దెబ్బలు పసరుతోనే తగ్గినై! ఫికర్ మత్‌కరో!'' అంటూ ధైర్యం చెప్పిండు ఖాశీం.

* * *

ఓ వారం గడిచింది.

ఇంట్లో సామాన్లు నిండుకున్నయ్.

'రెక్కాడనిదే డొక్కనిండది!' అనుకొని దెబ్బమీద పాతబట్ట ఏశి, గట్టిగ గుంజి కట్టిండు ఖాశీం.

పెళ్లాం సాయంతోటి గుట్టెక్కి పనిలో నిమగ్నమైండు. కానీ, జల్దినే అల్శిపోయిండు. రాత్రంత నిద్ర కరువైంది.

వాపు, నొప్పి పెరిగింది. ధైర్యం శెడ్డది. తల్లడిస్తుండు. ఇంగ ఇంటికాడ మగ్గదని సైకిల్ మీద ఖాశీంను కూకుండ వెట్టి.. నెట్టుకుంటనే బాటెంబడి వడ్డది నసీంబీ.

ఆళ్లను సూశిన బ్రాహ్మణ అనసూయమ్మ..

''చూసింద్రానుల్లా! పెనిమిటి పెళ్లామంటె.. అగో గట్ల ఉండాలె. అర్ధనారీశ్వరోలె గంపెడంత ప్రేమ ఉండాలె. నిండ నూరేళ్లు బతకాలె ఈళ్లు!''.. అని దీవించింది.

పక్కనే ఉన్న పటేల్ పార్వతమ్మ..

''మన ఊళ్లె ఇంత మంచి జంట కనిపించది. ఈళ్లు సల్లగుండాలె!'' అన్నది.

తొవ్వొంటి ఆళ్ల ముచ్చట్లు ఇనుకుంటనే.. పెయ్యంత సల్ల శెముటలు గారంగ, అతికట్టం మీద ఇల్లంతకుంట సర్కారు దవాకాండ్లకు చేరుకుంద్రు.''అయ్యా! మీకు హజారు సలాంలు!'' అని డాక్టర్‌తో మొరపెట్టుకుంది నసీంబీ.

''దెబ్బ తాకిన్నాడే ఎందుకు రాలేదు? ఇంత వాపు వచ్చింది. బాగా సెప్టిక్ అయ్యింది. ఈడ కాదు.. సిరిసిల్ల దావకాండ్లకు పోండ్రి'' అన్నడు డాక్టర్ ఆవేశంగా.

''అయ్యా! సిరిసిల్లకు పోవాల్నంటే మాతాన పైసలు లేవు. నీ కాళ్లు మొక్కుత! ఈడనే నయం చేయుండ్రి''.. అని గొడగొడ ఏడ్సుకుంట బతిమ్లాడింది నసీంబీ.

''సూడమ్మా! ఇప్పటికే పాణాల మీదికి తెచ్చింద్రు. జరగరానిది జరిగితే నామీద దుమ్మంటరు.. మన్నంటరు! ఆయినె బతకాల్నంటే సిరిసిల్లకు పోండ్రి!''.. డాక్టరు గద్దరించి పెట్టిండు.

చేతుల సిల్లిగవ్వ లేదు. తొవ్వల అటుఇటు దిక్కులు చూసింది. సర్పంచ్ కొడుకు దయాకర్ రావు.. బైక్‌పైన దేవునోలె కనిపించిండు.

''అయ్యా! శిన్నదొర!'' అని గట్టిగా పిలిశింది నసీంబీ.

ఎన్కకు తిరిగి చూసి.. మనోళ్లే అనుకొని దగ్గరికి అచ్చిండు దయాకర్ రావు. సంగతి తెలుసుకొని డాక్టర్‌తో మాట్లాడిండు. తనకు ఖాశీం జేసిన మేలు యాదికి వచ్చింది. రుణం దీర్చుకోవాలనుకుండు. ఆటోల కోసం బస్టాండ్‌కు, అడ్డాల మీద చూసిండు. ఒక్క ఆటోగుడ లేదు.

''నువ్వు ఏడ్వకు. నడుమల ఖాశీంను కూకోవెట్టు. నువ్వు ఎన్క కూసొని గట్టిగ వట్టుకో!'' అని నసీంబీకి శెప్పి.. బైక్ స్టార్ట్ చేసిండు.

బైక్‌ను పైలంగ నడుపుకొంట.. సిరిసిల్ల తొవ్వ వట్టిండు దయాకర్ రావు. పొక్కలున్న కాడ, రాళ్లు రప్పలున్న కాడ బండి ఎత్తేత్తుంటే.. ఖాశీం మూలుగుతూ అవస్థ పడుతుంటే.. దయాకర్ రావు మనసుల తుపాను చెలరేగింది.

'పుటుక్కున పానం పోతే బద్నాం అయితనేమో! అయ్యో! అంజన్న దేవుడా! దవాకాండ్లకు పోయేదాకా ఏం గానీయకు!' అని మనసుల్నే మొక్కుకుంట.. బుగులు బుగులుగనే సిరిసిల్ల చేరుకున్నడు. గప్పుడు జర ఊపిరి పీల్చుకుండు దయాకర్ రావు.

తొవ్వల్నే ఉన్న ఓ ప్రైవేటు దవఖానకు దీసుకపోయింద్రు. అక్కడ పదివేలు అడ్వాన్స్ కట్టమన్నరు.

అక్కడ పనిజేసే డాక్టర్ ఆళ్లూరి పట్వారి కొడుకు కనుకారావు. దయాకర్ దోస్తే! ఆయినె రూములకు వోయి..

''నమస్తే డాక్టర్ సాబ్!'' అన్నడు చిరునవ్వు చిందిస్తూ..

''అరే దయాకర్ రావు బాగున్నావురా! ఏంది గిట్లచ్చినవ్!?'' అడిగిండు కనుకారావు.

''అరే కనుకం! మనూరి తురక కాశితాత! గదే కీర్ తాత! యాదికున్నడారా!''..

''అవున్రా! మనూళ్లే 'కీర్ తాత' అంటే తెల్వనోడు ఎవలురా!'' అన్నడు కనుకారావు.

''ఆయినె కాలుకు శీలమొల దిగి సెప్టిక్ అయ్యింది. దవాఖాన్ల శెరిక్ జేద్దామంటే అడ్వాన్స్ అంటున్నరు. గిప్పుడు ఆళ్లకాడ పైసలు లెవ్వు. నువ్వు చెప్పురా కనుకం!'' నెమ్మదిగా చెప్పిండు దయాకర్ రావు.

''అది గంతేరా! ఎవరికైనా రూలే. అడ్వాన్స్ కట్టి శెరిక్ కావాల్సిందే!''.. కనికరం లేకుండా, నిర్మొహమాటంగా ముఖం మీదే చెప్పిండు.. కనుకారావు.

గుండెల్లో కలుక్కుమన్నది దయాకర్ రావుకు.

''అరే కనుకం! శిన్నప్పుడు బతుకమ్మ పండుక్కు తంగెడు పువ్వు కోసం పోతే.. నిన్ను పెద్ద నాగుపాము కర్సింది. గది జూశిన ఖాశీం తాత నిన్ను భుజం మీద ఏసుకొని.. శెముటలు కక్కుకుంట మీ ఇంటి దాకా ఎత్తుకొచ్చిండు. మీ నాయన ఇంటికాడ లేకుంటె.. సవారి కచ్చురం గట్టి మీ అమ్మను, నిన్ను సిరిసిల్ల సర్కారు దావఖాండ్లకు తీసుకొచ్చిండు. నీకు పాముసూది ఇప్పించినంకనే నిమ్మలమైండు ఖాశీం తాత! నీకు ప్రాణదాత కదరా! గిట్లనే ఊళ్లె ఎందరినో ఆదుకున్నడు. ఆయనె రుణం తీర్చుకోవడం.. మన ధర్మం కదరా!''.. అంటూ బుద్ధిమాట చెప్పిండు దయాకర్‌రావు.

''చూడురా! నువ్వేంది నాకో చెవ్వు పోటైనవు. లక్షల పెట్టుబడితో ఈ దావఖాన పెట్టినం. పుక్యానికే వైద్యం చేస్తే.. మేము నెత్తికి బురద పూసుకునుడే. ఇంగ నీ నీతులు కట్టిపెట్టి ఇసొంటి కేసులు తీసుకురాకు. నా ఇజ్జత్ తీయకు. నా టైం వేస్ట్ చేయకు. సర్కారు దావఖాన్లకు పో! ఇంగ పోరా!'' అంటూ రుసరుస వార్డులోకి వెళ్లిండు కనుకరావు.

తలవంచుకొని ఖాశీంను సర్కారు దావఖానలో జాయిన్ చేసిండు. కనకారావు అన్న మాటలు మెదడును తొలిచినయి .

''ఏమయ్యా! దొంగలు వడ్డంక ఆర్నెల్లకు కుక్కలు మొరిగినట్లు.. గిప్పుడు వస్తే ఏం చేసేది. కాలంతా సెప్టిక్ అయ్యింది. నేను రాసిన పరీక్షలు చేయించుకోండి. రిపోర్టు వచ్చినంక చెప్పుతా కాలు తీసేసుడా! ఉంచుడా?'' అన్నడు కాశిరెడ్డి డాక్టర్.

ఒక్కసారి గుండెలో పిడుగు వడ్డట్లైంది ఖాశీంకు.

''ఒరేయ్ ఖాశీంగా! ఛీ..ఛీ! నీ జిందగీ పూర కిరికిరిరా! ఎదురైనోళ్లకు పుణ్యం చేస్తే, నీకు పాపం చుట్టుకుందిరా!'' అంటూ తనకు తానే గట్టిగ తిట్టుకుండు.

''ఓయ్! ఎవలను తిడుతున్నవ్? పురుగు మెసులుతుందా!'' అన్నడు డాక్టర్.

''అరే అల్లా! నిన్నెందుకు తిడుత బాంచన్! నన్ను నేను తిట్టుకుంటున్న''.. బతిమాలుతూ అన్నడు ఖాశీం.

''నీ పేరేంది?'' అడిగిండు డాక్టర్.

''అయ్యా! ఖాశీం!'' అన్నడు.

'ఓహో! పేరు పోలికా?!' అనుకుండు మనసుల డాక్టర్.

కాసేపైనంక..

''అయ్యా! మనం మంచిచేస్తే.. మనకుబీ మంచే జరుగుతదట నిజమేనా అయ్యా?!''.. డాక్టర్‌తో ముచ్చట మొదలువెట్టిండు ఖాశీం.

''అక్షరాలా జరుగుతుంది. ఇంతకు నువ్వేం చేసినవయ్యా?'' అడిగిండు డాక్టర్.

''మత్తుగ చేసిన! అండ్ల ఒక్కటి చెప్త! ఓనాడు మైసమ్మ మూలకు నల్లగ మొగులైంది. కుండపోత వాన. ఉరుములు, మెరుపులు.. నేను, నా నసీంబీ జల్దీ జల్దీ గుట్ట దిగుతున్నం. మా సూపు వరిచేనుల పడింది.